# నేనూ.. క్లింటన్ ఫోటో!

కోలపల్లి ఈశ్వర్



"ఎందుకండీ దాన్నక్కడ తగిలిస్తున్నారు? ఇంతకీ ఎవరిదా ఫొటో?" అడిగింది మా ఆవిడ.

పదో తరగతి పాసైందన్న మాటే గానీ, ఉత్త మొద్దవతారం. బొత్తిగా లోకజ్ఞానం లేని మనిషి.

న్యూస్ పేపర్ అనేది ఆవిడ దృష్టిలో పిండి జల్లించుకోవడానికీ, వంటసామాను పెట్టుకునే అల్మైరాలో అడుగున పరుచుకోవడానికీ, నట్టింట్లో మా చటాడెప్పుడైనా కక్క కూర్చుంటే ఎత్తిపారెయ్యడానికి మాత్రమే పనికొచ్చే ఒక సాధనం.

అలాగే టీవీలో కూడా ఎప్పుడూ వార్తలు చూసిన పాపాన పోదు. ఆవిడగారు టీవీ ముందున్నప్పుడు వార్తలు గనుక స్టార్టయితే, రిమోట్ చేతిలోనే ఉంటుంది కదా ... ఠక్కున ఛానెల్ మార్చేస్తుంటుంది. సినిమాలు, సినిమా పాటలు, అవేవో దిక్కుమాలిన సీరియల్సూ ... టీవీ ఉపయోగం ఆవిడ దృష్టిలో అంతవరకే.

ఉత్త మొద్దు రాచ్చిప్ప! నూతిలో కప్ప!

ఏదో అక్క కూతురు కాబట్టి, అమ్మా నాన్నా చెవులు పిండి చేసేశారు కాబట్టి చేస్కున్నానే తప్ప, నిజానికి దానివల్ల ఒక సుఖమా, పాడా?!

అజ్ఞానానికి తోడు చాదస్తమూ ఎక్కువే! నిత్యమూ ఏవో పూజలు చేస్తూనే ఉంటుంది. నోములనీ, వ్రతాలనీ, నా పిండాకూడనీ ఏవిటేవిటో చేస్తూంటుంది.

ఒకరోజు శనివారమంటుంది, ఒకరోజు శుక్రవారమంటుంది. ఒకరోజు లక్ష్మివారమంటుంది. వారానికి నాలుగైదు రోజులు ఉపవాసముంటే మనిషిలో ఏం ఓపికుండి చస్తుంది గనుక?!

చెయ్యి వెయ్యబోతే చాలు, ఏదో ఒక వంకతో సిద్ధంగా ఉంటుంది.

అలాంటి మనిషి వల్ల ఎవరు మాత్రం ఏం బావుకుంటారు? ఎవరు మాత్రం ఏం సుఖపడగలరు? నోములూ, వ్రతాలూ, పూజలూ పురస్కారాలూ ... ఇవి కావు కదా భార్యనుండి కోరుకునేవి?!

కానీ ఆ జ్ఞానం ఆవిడకేడిస్తే కదా!

ఏవన్నా అంటే పద్ధాకా అదే ధ్యాస ఉండకూడదంటుంది. ఆయుక్షీణమంటుంది. ఇంకేదేదో అంటుంది పెద్ద లోక జ్ఞానిలా.

అమెరికా అధ్యక్షుడైన బిల్ క్లింటన్‌ని గుర్తుపట్టలేని మనిషికి లోకజ్ఞానం ఒహటా!

"ఇదా ... ఇది కొనకంచి సాంబమూర్తి అని చెప్పి నా ఫ్రెండుదిలే ..!" అన్నాను నేను స్టూల్ మీదనుంచి కిందకు దిగుతూ.

"అయితే తెలుగువాడే అన్నమాట! మరి అలా ఇంగ్లీషువాడిలా ఉన్నాడేంటి?" అంది తను క్లింటన్ ఫొటోకేసి ఆశ్చర్యంగా చూస్తూ.

"చిన్నప్పటి నుండి ఇంగ్లీషు మీడియం స్కూల్లో చదువుకున్నాడ్లే! అందుకే అలా ఇంగ్లీషు వాడయ్యాడు!" సాధ్యమైనంత సీరియస్‌గా అన్నాన్నేను. నవ్వు రాబోయింది గానీ, నిభాయించుకున్నాను.

"ఓహో..!" అంటూ ఏదో అర్థమైనదానికిమల్లే తల పంకించి, "అరెః పప్పు మాడిపోతున్నట్టుంది!" అంటూ కిచెన్‌లోకి పరుగు తీసింది.

పేరు సరస. కానీ ఏం లాభం? సరసం అనే పదానికి అర్థం తెలియని మనిషి! ఎప్పుడైనా మొక్కుబడిగా, అదైనా ఏదో తప్పు చేస్తున్నట్టుగా ఒప్పుకుంటుందే తప్ప, శృంగారం అంటేనే ఆసక్తి లేదసలు.

ఏవన్నా అంటే, "అదేంటండీ అలా అంటారు? ఈ పూజలూ, పురస్కారాలూ అన్నీ దేనికోసం చేస్తున్నాను? మీ కోసమేగా? మీరు క్షేమంగా ఉండాలనేగా?" అంటుంది.

క్షేమంగా ఉంటే సరిపోతుందా? మనిషన్నాక 'సుఖం' ఉండొద్దూ! ఎంత చెప్పినా అర్థం చేసుకోదు. అందుకే ...

ఇక గత్యంతరం లేక ఓ చిన్నిల్లేదైనా సెటప్ చేయ్యాలని ఎన్నాళ్లనుంచో అనుకుంటున్నాను నేను.

కానీ తగిన మనిషెవరూ తారసపడట్లేదు.

ఒకసారి మా ఆఫీసులో పనిచేసే మాధవి అనే టైపిస్టు, మొగుడు లేడామెకు. చిన్న వయసు. కదిపి చూశాను. కానీ లాభం లేకపోయింది. "నేనలాంటి దాన్ని కాదు. ఇంకెప్పుడూ ఇలాంటి ప్రస్తావన తీసుకురాకండి!" అనేసింది నిర్ద్వంద్వంగా. ఇంకా నయం చెప్పుచ్చు కొట్టలేదు.

మరోసారి రామలక్ష్మని మరో మగువను ముగ్గులోకి దింపబోయా కానీ, అది కూడా బెడిసికొట్టింది. "మళ్లీ గనుక ఇలాంటి మాటలు మాట్లాడారంటే మర్యాదగా ఉండదు!" అంటూ మర్యాదగానే వార్నింగిచ్చింది.

నేను చేస్తున్నది పెద్ద ఆఫీసరు ఉద్యోగమాయె!

అదే గనుక ఏ లేబరుణ్ణో అయ్యుంటే ఏ ఎల్లమ్మనో పుల్లమ్మనో ఏమార్చగలిగేవాణ్లే! కానీ నా ఉద్యోగమే నా ప్రయత్నానికి పెద్ద ప్రతిబంధకమైంది. సాదా సీదా ఆడవాళ్లు నాతో మాట్లాడటానికి జంకుతారాయె.

"ప్చ్.." అనుకున్నాను, క్లింటన్ ఫొటోకేసి చూస్తూ. చిన్నిల్లు సెటప్ చేయడం కూడా ఓ పెద్ద ఆర్టే. అది నా కెప్పుడొచ్చుద్దో మరి?

అమెరికాలాంటి అగ్రదేశానికి అధినేతయ్యుండి కూడా ఆ మహానుభావుడు చిలక్కొట్టుడు కొడుతున్నాడూ అంటే ... నిజంగా ఎంత సరసుడు?

ఎప్పటికైనా ఓ చిన్నిల్లు సెటప్ చేసి తీరాలన్న నాలోని కోరిక చప్పబడిపోకుండా ఉండటానికీ, ఎప్పటికప్పుడు నాలో ఇన్‌స్పిరేషన్ కలుగుతూ ఉండటానికీ ...

అందుకే కేవలం అందుకే ... క్లింటన్ ఫొటోని నేను మా హాల్లో తగిలించాను.

000

"అదేంటల్లుడూ? క్లింటన్ ఫొటో తగిలించావేంటి?" చుట్టం చూపుగా మా ఇంటికొచ్చిన మా మాంగారు ఆ ఫొటోని చూసి అడిగారు.

"ఊరికే మాంగారూ! అమెరికా అధ్యక్షుడు కదా, అందుకని!" అన్నాను అంతకన్నా ఇంకేం చెప్పాలో తెలియక.

"అయితే?" అన్నారు మా మాంగారు.

"ఏం లేదు మాంగారూ! అందంగా ఉంటాడు కదా, అందుకని తగిలించా!" అన్నాను నోటికొచ్చినట్టు కోసేస్తూ.

"అదేంటండీ? అతను మీ స్నేహితుడనీ, పేరు కొనకంచి సాంబమూర్తనీ చెప్పారుగా?" అంది అక్కడే ఉన్న మా ఆవిడ.

కూతురి అజ్ఞానానికి పడీపడీ నవ్వారు మా మాంగారు.

"భలేదానివే అమ్మాయ్! మరీ ఇంత అమాయకం అయితే ఎలా? అతను కొనకంచి సాంబమూర్తీ కాదు, కందిమళ్ల గురుమూర్తీ కాదు! అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్!" అన్నారు నవ్వడం పూర్తయ్యాక.

"అమెరికా అధ్యక్షుడా!?" అంది మా ఆవిడ ఆశ్చర్యంగా.

"అవునమ్మాయ్! నువ్వు టీవీ చూళ్లేదా, పేపరులో చదవలేదా లూయిన్స్కీతో అతనికున్న సంబంధం గురించి ఈ మధ్య చాలా రాద్ధాంతం జరిగిందిగా?" అన్నారు మా మాంగారు.

"లూయిన్ స్కీ అంటే అతని భార్యా?" అడిగింది సరస.

"కాదు, భార్య వేరే ఉంది. ఆ అమ్మాయి అతని ప్రియురాలు!" ఆఖరి నాలుగక్షరాలూ కాస్త ఇబ్బంది పడుతూనే చెప్పారు మా మాంగారు.

"ఛీ! భార్య ఉండగా ఇంకో స్త్రీతో సంబంధమా! పాడు మనిషి!" అంది సరస.

నేను లోలోన నవ్వుకున్నాను.

000

నేను మా మాంగార్ని ట్రైనెక్కించి ఇంటికి తిరిగొచ్చేసరికి సరస ఏదో కాగితమ్ముక్కని ఫెవికాల్‌తో హాల్లో గోడకంటిస్తూ కనిపించింది.

"ఏమిటది?" అన్నాన్నేను కుతూహలంగా.

"చదలవాడ శమంతకమణి ఫొటో!" అంది సరస.

"ఆవిడెవరూ?" ఆశ్చర్యంగా అడిగాను.

నిజంగానే అది ఒకమ్మాయి ఫొటో పేపర్ కటింగ్.

"ఇవ్వాళ పేపరు చూడలేదా మీరు? భర్త పరాయి స్త్రీతో సంబంధం పెట్టుకున్నాడని ఆగ్రహించి రోకలిబండతో నెత్తిమీద బాది చంపేసిందట ఓ ఇల్లాలు. ఆవిడే ఈవిడ. ఒకవేళ రేపు మీరు నాకేదైనా అన్యాయం తలపెడితే నేనూ ఆ పనే చెయ్యాలి కదా? అందుకే ఇన్‌స్పిరేషన్‌కోసం అంటిస్తున్నాను!" అంది సరస.

ఇన్‌స్పిరేషన్ ...

సరస నోటివెంబడి ఆ పదం రావడం వల్ల వెంటనే నాకు డౌటొచ్చేసింది.

"కొంపదీసి నా డైరి గానీ చదివావా?" అన్నాను గాభరాగా.

"చదవబట్టేగా దీన్నిక్కడంటిస్తూంట?" అంది నవ్వుతూ.

"వద్దు, దాన్నక్కణ్నుంచి తీసేయ్! నేను కూడా క్లింటన్ ఫొటో తీసేస్తా!" అన్నాను ఠక్కున.

"మరి చిన్నిల్లో?" అంది సరస.

"అక్కర్లేదు! ఉన్నిల్లు చాలు. బతికుంటే బలుసాకు తినొచ్చు!" అన్నాన్నేను భయంగా.

"అలా రండి దారికి!" అంటూ నవ్వేసింది సరస.

■

